

ఈసారైనా వస్తారా?



అన్నమయ్య, తిరుపతి జిల్లాల అధికారులపై జడ్పీటీసీల గుర్రు

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విభజన తర్వాత జడ్పీ సర్వసభ్య సమావేశానికి అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు గైర్హాజరవుతున్నారు. దీంతో ఆయా జిల్లాల పరిధిలోని సభ్యులు సమస్యలపై ఎవరితో చర్చించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదో ఒకటి రెండు సమావేశాలకు రాకుంటే ఏదో పని ఉందని అనుకోవచ్చు. కానీ ప్రతి సమావేశానికీ వారు రావడం లేదు. దీనిపై ఇదివరకే సర్వసభ్య సమావేశంలో గైర్హాజరైన జిల్లాస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అయినా వారి తీరు మారలేదు. గతంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి కానీ, సర్వసభ్య సమావేశానికి కానీ హాజరు కాలేదు. దీంతో తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన సభ్యుల్లో చాలా మంది వెళ్లినా వారి సమస్యలు విని పరిష్కరించే అధికారులు లేకపోవడంతో సమావేశానికి రావడం మానుకున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే...

జిల్లా పరిషత్‌లో దాదాపుగా జడ్పీటీసీలందరూ కూడా వైసీపీకి చెందిన వారే కావడంతో వీరు ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని సభలోనే ఆరోపిస్తున్నారు. మండలాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని, మండలాధికారులు కనీస మర్యాద ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభలో గొంతుచించుకొని సమస్యలను విన్నవించినా అవి జరగడం లేదని సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇక సభకు వెళ్లేది ఎందుకని అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు.

● ఎమ్మెల్యేలు హాజరవుతారా?

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒకట్రెండు జడ్పీ సమావేశాలకు తప్ప కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకావడం లేదు. గత సమావేశానికి కూడా ఇద్దరు ఎమ్మెల్యేలే హాజరయ్యారు. జిల్లా అధికారులు ఎలాగూ రారు కనీసం తమ నియోజకవర్గ ఎమ్మెల్యేలకైనా విన్నవించుదామనుకున్నా వారు సమావేశాలకు రావడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈసారైనా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారా అని చూడాల్సి ఉంది.

26 మండలాల్లో వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నాలుగైదు రోజులుగా జిల్లాలో ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకుంటోంది. పలు మండలాల్లో మోస్తరు నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి.దీనికితోడు చలిగాలులు వీస్తుండడంతో వృద్ధులు, పసిపిల్లలు ఇబ్బంది పడుతున్నారు.పంటకోతలకు కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. తుఫాన్ ప్రభావంతో గడిచిన 24 గంటల్లో 26 మండలాల్లో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఎస్ఆర్‌పురం మండలంలో 40.6మి.మీ, అత్యల్పంగా చిత్తూరు రూరల్‌లో 0.4 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా కార్వేటినగరంలో 9.6, విజయపురంలో 9.2, చౌడేపల్లెలో 9, వెదురుకుప్పంలో 8.2, వి.కోటలో 6, పుంగనూరులో 5.6, గంగాధరనెల్లూరులో 5.2, నింద్రలో 5.4, పెద్దపంజాణిలో 4.6, పలమనేరులో 4.5, రొంపిచెర్ల, పెనుమూరు మండలాల్లో 4.2, సదుం, తవణంపల్లె, చిత్తూరు అర్బన్ మండలాల్లో 3.2,పాలసముద్రంలో 3.4, సోమలలో 2.8, ఐరాలలో 4, పూతలపట్టులో 2.4, రామకుప్పం,గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో 2.2, బంగారుపాళ్యంలో 1.2, శాంతిపురంలో 2,మిమీ వర్షపాతం నమోదైంది. కాగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నింద్రలో 5.4, విజయపురంలో 9.2, కార్వేటినగరంలో 9.6, పాలసముద్రంలో 3.4మిమీ వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

● పర్యవేక్షణకు ఆరుగురు అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 88 ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాల అమలు తీరు పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లో శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. కలెక్టరేట్‌లో నిర్మించిన నాగార్జున వీడియో కాన్ఫరెన్స్ హాలులో దీన్ని ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ఆరు గురు అధికారులను నియమిచారు. ఎప్పటికప్పుడు వివరాల సేకరణకు ఇబ్బందుల్లేకుండా ఐదు ల్యాండ్‌లైన్ ఫోన్లను ఏర్పాటు చేశారు. వీటి నెంబర్లు 08572-242730, 242731, 242732, 242733, 242734. ఇన్‌ఛార్జి ఆఫీసర్లుగా డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా వినోద్, సుధాకర్, పురుషోత్తం, అరవిందరెడ్డి, రామాంజనేయులును నియమించారు. వీరి మొబైల్ నెంబర్లను అందుబాటులో ఉంచారు. డివిజన్ల వారీగా మండలాలు, మున్సిపాలిటీల్లో అన్ని ప్రభుత్వ శాఖల కార్యకలాపాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సచివాలయ వ్యవస్థలో హాజరు, పనితీరు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే వినతుల పరిష్కారం, పనుల ప్రగతిని ఈ కంట్రోల్ రూమ్ అధికారులు పర్యవేక్షిస్తారు. రోజువారీ ప్రగతి వివరాలను కలెక్టర్‌కు కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు అందిస్తారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్య సిబ్బంది నియామకం

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 1051 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం 1365 మంది సిబ్బందిని నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఔట్‌సోర్సింగ్ విధానంలో ఈ సిబ్బందిని నియమించనున్నారు. వీటిలోలో 441 బాలికల హాస్టళ్లున్నాయి.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలు విడుదల

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూలును ఓపెన్ స్కూల్ సొసైటీ శుక్రవారం ప్రకటించింది. మార్చి 16 నుంచి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని వివరించింది. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొంది.





వి.కోట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి - చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద జడ్పీ స్కూల్లో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్-పిల్లల విద్యాప్రగతి గురించి తల్లికి వివరిస్తున్న ఓ టీచరు



మంచి పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దడం

మనందరి బాధ్యత

● మెగా పీటీఎం కార్యక్రమాల్లో ప్రముఖుల వాణి



రొంపిచెర్లలో విద్యార్థినుల కరాటే ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని తెలియజేయడమే మెగా పీటీఎం 3.0 లక్ష్యమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ-సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు మెగా పేరెంట్, టీచర్స్ మీటింగులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 2408 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు గాను 2202 పాఠశాలల్లో (91శాతం) ఈ సమావేశాలు నిర్వహించారు.పిల్లల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు హాజరు కాగా విద్యార్థులతో పాటు టీచర్లు వారికి స్వాగతం పలికారు.పిల్లల విద్యాభ్యాసం గురించి వివరించారు.పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనతో పాటు ఎటువంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను తల్లిదండ్రులకు టీచర్లు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను చూపించి వివరించారు. విద్యార్థులచే ఏర్పాటు చేయించిన ఎగ్జిబిషన్లలో క్రీడా సామగ్రి, ల్యాబ్, లైబ్రరీ పుస్తకాలు, జాదుయ్ పిటార్ కిట్లు, ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్ కిట్లను అతిథులు సందర్శించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల (సమగ్ర మూల్యాంకన పత్రాలు)ను విద్యార్థులు అందుకున్నారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్లు సహపంక్తిన మధ్యాహ్న భోజనం చేయడంతో కార్యక్రమం ముగిసింది.

మాక్ అసెంబ్లీలో మంత్రిగా మరచిపోలేని అనుభూతి



రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 26న ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో నేను చిత్తూరు ఎమ్మెల్యేగానే కాక రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించాను. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష నేతలు అడిగన ప్రశ్నలకు దీటైన జవాబులిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ తదితరులతో ప్రశంసలందుకోవడం నా జీవితంలో మరచిపోలేని అనుభూతి. నన్ను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, పాఠశాల హెచ్ఎంకు, టీచర్లకు రుణపడి ఉంటాను.

- ఎన్.ప్రియదర్శిని,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిత్తూరు



రామలింగం మృతదేహం

బోల్తా పడ్డ లారీని చూస్తుండగా

దూసుకొచ్చిన బస్సు

● ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై బోల్తా పడ్డ లారీని చూస్తున్న వారిపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు.కార్వేటినగరం మండలంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై నుంచి చిత్తూరు వైపు ఓ లారీ ఆయిల్ డబ్బాలతో కార్వేటినగరం మీదుగా వెళుతుండగా ఆర్కేవీబీపేట క్రాస్‌రోడ్డు ఇందిరా కాలనీ సమీపంలోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ విషయం తెలియడంతో ఇందిరాకాలనీ, ఆర్కేవీబీపేట గ్రామస్తులు కొందరు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును చూస్తుండగా తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కార్వేటినగరం మీదుగా పళ్లిపట్టుకు వెళ్తూ అక్కడ ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. అలాగే ఇందిరా కాలనీకి చెందిన రామలింగం(64), గిరిబాబుపై దూసుకెళ్లింది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామలింగం చనిపోయారు. గిరిబాబును మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించారు. మృతుడి కుమారుడు వాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గాయపడిన సమయంలో చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలిస్తే అక్కడ డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు అందుబాటులో లేరని, వారిపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ప్రముఖ పారిశ్రామికవేత్త

బద్రీనారాయణ మృతి



బద్రీనారాయణ (ఫైల్ ఫొటో)

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పారిశ్రామికవేత్త బద్రీనారాయణ(72) అనారోగ్యంతో కన్నుమూశారు.చిత్తూరులోని బీవీ రెడ్డి కాలనీలో నివసిస్తున్న ఆయనకు శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని అమర హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు.అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు.ప్రస్తుతం ఆయన మృతదేహం అమరా ఆస్పత్రిలోనే వుంది.అమెరికాలో వున్న తన సోదరి వచ్చాక సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బద్రీనారాయణ కుమారుడు నవీన్ తెలిపారు. మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు సోదరుడైన బద్రీనారాయణ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గతంలో పనిచేశారు.ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్,టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు గీర్వాణి చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, వసంతకుమార్, వెంకటేష్ యాదవ్, కాండ్ర రమేష్ నాయుడు, మోహన్‌రాజ్,అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్,తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి తదితరులు బద్రీనారాయణ మృతి పట్ల సంతాపం తెలిపారు.



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.1,72,10,021 ఆదాయం లభించింది. శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచల కిషోర్ పర్యవేక్షణలో స్వామి కానుకలను ఆలయ సిబ్బంది లెక్కించారు. 39 గ్రాముల బంగారు, 890 గ్రాముల వెండితో పాటు 932 యూఎస్,10 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు, 520 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లాండు పౌండ్లు, 50 మలేసియా రింగిట్స్, 10 సౌదీ రియాల్స్ సమకూరాయి. అలాగే గో సంరక్షణ హుండీ ద్వారా రూ.16,514, నిత్యాన్నప్రసాద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.22,067 ఆదాయం లభించింది. ఆలయానికి ఈ ఆదాయం 21 రోజులలో సమకూరినట్లు ఈవో తెలిపారు.డీఈవో సాగర్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈవో రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనపాల్, ధనంజయ, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బోయకొండలో

శాశ్వత నిత్యార్చన సేవలు

చౌడేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శాశ్వత నిత్యార్చన సేవలను ప్రవేశపెట్టనున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో రానున్న సంక్రాంతి నుంచి అమ్మవారికి శాశ్వత నిత్యార్చనకు ఏడాదికి రూ.10,116, 6 నెలలకు రూ.7,116, మూడు నెలలకు గాను రూ.5,116, నెలకు రూ.2,116 తో సేవా టిక్కెట్లు ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కుంకుమార్చన రూ.101, వడిబాల సేవ రూ.201 లతో నూతన సేవలు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.



అక్కదేవతలకు కార్తీకపూజలు

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డు లోని అక్కగార్ల గుడిలో ఏడుగురు అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగం ఆధ్వర్యంలో క్రార్తీక మాస పూజలు నిర్వహించారు. సారె సమర్పించారు. ఈ సందర్భంగా అక్కగార్ల ఆలయాన్ని పుష్ప, విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈకార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ట్రాన్స్‌పోర్టు డీఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

జనవరికల్లా అందుబాటులోకి బయోగ్యాస్‌ప్లాంట్



తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి 2026 జనవరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐఓసీఎల్ ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని డంపింగ్ యార్డు వద్ద ఐఓసీఎల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, ఘన వ్యర్థాల నిర్వహణపై పద్మావతి గెస్ట్‌హౌస్‌లో టీటీడీ, ఐఓసీఎల్ ప్రతినిధులతో శుక్రవారం అదనపు ఈవో సమీక్షించారు. గ్యాస్‌ప్లాంట్ ప్రాంగణంలో కాలుష్య ద్రవాల నివారణకు అదనపు గల్పర్ మెషిన్లు ఏర్పాట్లు చేయాలన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 51,082

తలనీలాలు సమర్పించినవారు: 19,836

సీనియర్ సిటిజెన్స్‌కు నేరుగా దర్శనాలు కల్పించండి



'డయల్ యువర్ టీటీడీ ఈవో' లో కోరిన భక్తులు

'మేము దివ్యాంగులం. ఐదు నెలలుగా ఆన్‌లైన్‌లో టోకెన్ల కోసం ప్రయత్నిస్తున్నా లభించడం లేదు.'

ఆన్‌లైన్‌లోనే ఇస్తే పాకుతూ ముందుకు సాగే మాలాంటి వాళ్లం ఎలా దర్శనం చేసుకోగలం,

'నాకు 64 ఏళ్లు. ఎంతకాలం ఉంటానో తెలీదు. మాలాంటివాళ్లకు తిరుమలలోనే కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం కల్పించండి.'

వృద్ధులు, దివ్యాంగులను ఆన్‌లైన్ బుకింగ్‌కి పరిమితం చేయకండి. నేరుగా వచ్చినా స్వామి దర్శనం కల్పించండి అని పలువురు భక్తులు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం ఫోన్‌ల ద్వారా ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కోరారు. ఇలా కోరిన వారిలో మహేశ్వరయ్య (వెంకటగిరి), వెంకటేశ్వరరావు (ఏలూరు), శ్రీనివాస్(చెన్నై), దుర్గాప్రసాద్(భీమవరం) ఉన్నారు. ఇందుకు.. గతంలో క్యూలైన్ విధానంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేయడంతోనే ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నామని బదులిచ్చారు.

గుడిలో 'యో.. పోయా..'లు వద్దు

అలాగే, నాదనీరాజనం వేదికపై గత తరహాలో భారతం, రామాయణం, అన్నమయ్య కీర్తనలు, గరుడపురాణ కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీనివాసులు(హైదరాబాద్), రవి(రాజమండ్రి) కోరగా, త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. టీటీడీ ఉద్యోగులు, శ్రీవారిసేవలను ఆలయంలో 'యో.. పోయా' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని, అలా కాకుండా గోవిందా అనేలా చర్యలు తీసుకోవాలని శివశంకర్(వైజాగ్) సూచన చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఈవో చెప్పారు.

స్థానికులకు అన్యాయం

వైకుంఠద్వార దర్శనాల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి) ఈవో దృష్టికి తీసుకెళ్లగా, తొలి మూడురోజుల్లో బయటవాళ్లే కాకుండా స్థానికులు కూడా టోకెన్లు పొందారని ఈవో చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒంటిమిట్టకు 50 ఏళ్ల మాస్టర్‌ప్లాన్

అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన శుక్రవారం సాయంత్రం అధికారులతో దీనిపై సమీక్షించారు. కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, ఆధ్యాత్మిక చిహ్నాలు, మ్యూజియం, డిజిటల్ స్క్రీన్లు, కళామందిరం, చెరువులో 108 అడుగుల జాంబవతుడి విగ్రహం, మాడవీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అనిల్‌కుమార్ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ఇంటి ముందు దిగాలుగా రాజమ్మ

పాపానాయుడుపేటలో పేలిన గ్యాస్ సిలిండర్

● ధ్వంసమైన ఇంటి గోడ, కిటికీలు, సామాన్లు

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ఓ ఇంట్లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో స్టోర్‌రూంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దెబ్బతినింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లకపోగా గృహోపకరణాలు, ఇంటి గోడ ధ్వంసమయ్యాయి. పాపానాయుడుపేటకు చెందిన రాజమ్మ భర్త పదేళ్ల కిందట, కుమారుడు ఐదేళ్ల కిందట మృతి చెందారు. ప్రస్తుతం ఈమె ఒంటరి మహిళ. ఈమె ఏడాదికి రెండు సార్లు సదాశివకోనకు వెళ్లి ఈశ్వరుడికి పూజలు చేసి అక్కడే భక్తులకు అన్నదానం చేస్తోంది. ఈ క్రమంలో ఈనెలలో కోనకు వెళ్లడానికి సరుకులు, గ్యాస్ సిలిండర్‌ను స్టోర్‌రూంలో పెట్టింది. గురువారం రాత్రి భోజనం చేసి వరండాలో పడుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు కాలి గోతాల మీద పడటంతో ప్లాస్టిక్ కాలిన వాసన రాజమ్మకు వచ్చింది. స్టోర్‌రూంలో మంటలు ఎగసిపడుతున్నట్లు గుర్తించి వెంటనే వెలుపలకు పరుగులు తీసింది. రాత్రి 11గంటలు కావడంతో రాజమ్మ పెట్టిన కేకలకు కొంతమందే బయటకు వచ్చారు. అప్పటికే ప్లాస్టిక్ కవర్లకు వ్యాపించిన మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలింది. ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పాపానాయుడుపేటకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో స్టోర్ రూం గోడలు బీటలు వారాయి. సరుకులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులు పాపానాయుడుపేటకు చేరుకుని విచారణ జరిపారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన పళని లక్ష్మణ్ 2016లో తిరుమల తుంబురుతీర్థం వద్ద ఎర్రచందనం తరలిస్తూ అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేయగా.. అతడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. విచారణలో ఉన్న ఈ కేసును తాజాగా తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ వాదనలు వినిపించారు.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

● బాలాజీ రైల్వేడివిజన్ సాధించుకుందామని మేధావుల పిలుపు



తిరుపతి కేంద్రంగా మొదలైన బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు క్రమంగా ఊపందుకుంటోంది. రాయలసీమ అభివృద్ధికి ఇది ఊతంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేధావివర్గం గొంతు కలుపుతున్నారు. బాలాజీ డివిజన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతి నుంచి ఢిల్లీదాకా డివిజన్ వాణి వినిపిస్తున్నారు. డివిజన్ సాధించేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. అందరూ కలిసిరావాలని పిలుపునిస్తున్నారు. బాలాజీ రైల్వే డివిజన్‌వల్ల మనకు కలిగే ప్రయోజనాలేమిటో కొందరు ప్రముఖుల అభిప్రాయాలు ఇవి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సాధించి తీరుతాం



తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు ఇప్పటిది కాదు. మనకు ఎప్పుడో రావాల్సింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా, బాలాజీ డివిజన్ దారి మళ్లి గుంటూరుకు వెళ్లింది. ఈసారి ఎలాగైనా డివిజన్ సాధనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. మన ఆవేదనను ఎంపీల దృష్టికి తీసుకెళుతున్నాం. త్వరలోనే పదిమందితో ఢిల్లీకి వెళ్లనున్నాం. డివిజన్ ఏర్పాటైతే 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన ఉంటుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వసతులు, ఫ్రైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి. రాష్ట్రానికి భౌగోళిక-ఆర్థిక సమతుల్యత తీసుకువస్తుంది. దీనిద్వారా రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడుల వృద్ధికి గట్టి పునాది ఏర్పడుతుంది.

- కుప్పాల గిరిధర్, కన్వీనర్, బాలాజీ రైల్వే డివిజన్ సాధనసమితి

కొత్తరైళ్లు వేసుకోవచ్చు



బాలాజీ డివిజన్ వస్తే తిరుపతి రూపురేఖలు మారిపోతాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుంది. 30 మంది సివిల్ అధికారులు వస్తారు. ఎగుమతి, దిగుమతుల ద్వారా వందల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. తిరుపతి నుంచి కొత్తకొత్త ప్రదేశాలకు రైళ్లు వేసుకోవచ్చు. రాయలసీమలో ఉండే ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంటుంది. పుటపర్తిని కలుపుకోవచ్చు. అన్ని పుణ్యక్షేత్రాలకు రైళ్లువేసుకోవచ్చు. తిరుపతి నుంచి నెల్లూరు, కాట్పాడికి లోకల్ ట్రైన్స్ వేసుకోవచ్చు.

- వేణుగోపాల్ రెడ్డి, సాధన సమితి నేత

సీమ ముఖచిత్రం మార్చవచ్చు



రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో గుంతకల్లు జోన్ అడిగాం. అది మరుగున పడింది. ఇప్పుడు కేవలం డివిజన్ మాత్రమే అడుగుతున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 70 డివిజన్లలో తిరుపతి ఎందుకు అడుగుతున్నామంటే డివిజన్ ఉంటే డీఆర్‌ఎం మనకు అందుబాటులో ఉంటారు. డివిజన్ ఏర్పాటు ద్వారా వెస్ట్ రైల్వే స్టేషన్, తిరుచానూరు రైల్వే స్టేషన్లు అభివృద్ధిచేసుకోవచ్చు. మదనపల్లి మీదుగా కడప, పీలేరు మీదుగా తాడిపత్రికి రైల్వే లైన్లు వేసుకోవచ్చు. పాకాల నుంచి పలమనేరు మీదుగా మరొక రైల్వే లైను వేయాలని డిమాండు ఉంది. డివిజన్ కల సాకారమయ్యే దిశగా తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చాలి.

- భూమన్, రాయలసీమ ఉద్యమ నేత

పార్టీలకతీతంగా ఉద్యమించాలి

పాలికేళ్ల ముందటి తిరుపతి వేరు, ఇప్పుడు వేరు. పెరిగిన జనాభా, రెట్టింపైన భక్తులు, విస్తరించిన పరిధి. విద్య, వైద్య సంస్థలు, పరిశ్రమలు పెద్దఎత్తున తిరుపతి జిల్లాకు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకుని చూస్తే బాలాజీ రైల్వే డివిజన్ అవసరం ఉందని అర్థమవుతుంది. పరిశ్రమలకు అవసరమైన ముడిసరకులు, తయారైన ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అవసరమైన రవాణా సులభతరం అవుతుంది. టూరిజంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పన మెరుగవుతుంది. కనెక్టివిటీ బాగుంటే అభివృద్ధి బాగుంటుంది. డివిజన్ సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుంది. రాయలసీమ మరింత అభివృద్ధి చెందుతుంది. పార్టీలకతీతంగా ప్రయత్నం చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది.



- డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాధనసమితి నాయకురాలు

కనువిందుగా సదాశివకోన

వడమాలపేట మండలం సదాశివకోనలో జలపాతాలు కనువిందుచేస్తున్నాయి. సదాశివకోన, అమ్మవారికోనల్లో ఉవ్వెత్తున్న ఎగసి పడుతున్నాయి. ఈ జలపాతాల నీళ్లు ఏర్పేడు మండలంలోని సదాశివకోన ప్రాజెక్టుకు చేరుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





పరవళ్లు తొక్కుతున్న కైలాసనాథ కోన


నారాయణవనం మండలంలోని కైలాసనాథ కోన జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొండలమీద నుంచి కిందకు దూకే జలపాతం సందర్శకుల్ని మంత్రముగ్ధులను చేస్తున్నది. వర్షాలతో పరిస్థితులు కొద్దిగా ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో భద్రతపరంగా తాత్కాలికంగా ప్రవేశాన్ని నిలిపివేశారు.


- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

జలపాతాల జోరు

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఉబ్బలమడుగు, కేవీబీ పురం మండలంలోని ఆరె జలపాతాలు వయ్యారాలు ఒలుకుతున్నాయి. ప్రస్తుతం ఈ జలపాతాల వద్దకు పర్యాటకులను ఆపేశారు. మరో రెండు రోజుల్లో అనుమతించనున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి





ఉబ్బల మడుగు - ఆరె జలపాతం...

ప్రామాణిక పరిశోధనలకు రూ.25 లక్షలు అందిస్తాం

● ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు సురేష్ ● వెటర్నరీ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ విభాగాల్లో ప్రామాణిక పరిశోధనలు రూపొందించేందుకు ప్రోత్సాహంగా రూ.25లక్షలు అందిస్తామని ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు, వర్సిటీ పూర్వవిద్యార్థి డాక్టర్ పూసల సురేష్ పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై శుక్రవారం ముగిసిన రెండు రోజుల పీజీవిద్యార్థుల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. వర్సిటీలో చేపడుతున్న పరిశోధనలు ప్రామాణికత, నాణ్యతగా ఉన్నాయని అభినందించారు. భవిష్యత్‌లో వర్సిటీతో కలసి సంయుక్తంగా పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంటర్‌డిసిప్లినరీ పరిశోధనల అవసరం మరింతగా పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అధునాతన పరిశోధనలు రూపొందించాలని ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ సూచించారు. వెటర్నరీ సైన్స్ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్‌డీన్ డాక్టర్ జగపతిరామయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వినూ, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్విజ్‌పోటీలు

బీవీఎస్సీ ఫైనలియర్ చదివే విద్యార్థులకు ఆరుసెషన్లలో నిర్వహించిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఫైనల్‌లో ప్రతిభచాటిన పదిమందికి అవార్డులతోపాటు నగదు బహుమతి అందించారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు, పోస్టర్ ప్రజంటేషన్స్ చేసిన వారికి అవార్డులు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న వీసీ జేవీ రమణ, సురేష్ తదితరులు



ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసేందుకు కోర్టుకు వచ్చిన విద్యార్థులు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై జడ్జికి ఫిర్యాదు

సత్యవేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతపై విద్యార్థులు శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయమూర్తి వెంకట నాగరాజుకు ఫిర్యాదు చేశారు. హాజరు శాతం తక్కువగా ఉందంటూ తమ చేత పరీక్ష ఫీజులు కట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారంటూ ఆరోపించారు. విద్యార్థుల ఫిర్యాదును ఉన్నత విద్యాశాఖ అధికారులకు పంపిస్తానని జడ్జి వెంకట నాగరాజు తెలిపారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

● ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు

రేణిగుంట డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన కైలాష్, బాబు గౌడ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వీరిని తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి దొరికిందన్నారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ చెందిన చాహల్‌కు గంజాయిని అప్పగించేందుకు వెళుతున్నట్లు విచారణలో చెప్పారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఈ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. సీఐ జయచంద్ర, స్టేషన్ రైటర్ చలపతి పాల్గొన్నారు.



గంజాయిని, నిందితులను చూపుతున్న డీఎస్పీ

సీఐఐ యంగ్ ఇండియన్స్ చాప్టర్ చైర్‌గా నితిన్

తిరుపతి(వైద్యం)/చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఐఐ యంగ్ ఇండియన్స్, తిరుపతి చాప్టర్ తన వార్షిక సెషన్‌ను శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్లో నిర్వహించారు. తిరుపతి చాప్టర్ చైర్‌గా రావండ్స్ ప్లాస్టిక్ సేల్స్ అండ్ మార్కెటింగ్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసిన నితిన్ దత్తులూరిని, జాయింట్ చైర్‌గా చిత్తూరులోని బాలాజీ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రతీణ్ పోలవరపును నియమించారు. యువత పారిశ్రామిక రంగంలో రాణించడం వల్ల దేశం అభివృద్ధిపథంలో ఎంతో ముందుకు వెళుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరు మౌర్య, యంగ్ ఇండియన్స్ చైర్‌పర్సన్ వర్ష విశ్వనాథ్‌కస్తూరి, జాయింట్ చైర్ ప్రదీప్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నితిన్ దత్తులూరి

పాత కలెక్టరేట్‌కు పటిష్ఠ భద్రత



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వందేళ్లకు మించి చరిత్ర కలిగిన చిత్తూరు పాత కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టింది. పది రోజులుగా ప్రైవేటు వ్యక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్‌పై నిషేధం విధించారు. కలెక్టరేట్ ఆవరణంలో 14 ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రాత్రివేళల్లో మందుబాబులు ప్రవేశించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పనివేళల్లో కార్యాలయాలకు పనుల కోసం వచ్చేవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. ప్రాంగణం లోపల నెలల తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. రాత్రివేళల్లో ఇతరులు ప్రవేశించకుండా తాళాలు వేస్తున్నారు. పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఇటీవల డీఆర్వో మోహన్‌కుమార్ అధ్యక్షతన పాత కలెక్టరేట్ సుందరీకరణపై సమావేశం జరిగింది. ఇందుకోసం జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డితో పాటు 14శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు.

గోడ కూలి రెండు ఆవుల మృతి



కూలిన గోడ కింద మృతి చెందిన పశువులు, తీవ్రంగా గాయపడిన ఆవు

ఐరాల,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు ప్రాంతమైన గుడిపల్లెలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మట్టి గోడ కూలి రెండు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మునికృష్ణారెడ్డి మూడు ఆవులతో జీవనం సాగిస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి ఇల్లు పూర్తిగా నాని బలహీన పడింది. రాత్రి రైతు తన మూడు పశువులను ఇంటి ముందర కట్టేశాడు. రాత్రి 2 గంటల సమయంలో గోడ కూలి ఆవులపై పడింది. రెండు ఆవులు చనిపోయాయి. ఓ ఆవు నడుము విరిగిపోయింది. అదికూడా బతికే పరిస్థితి లేదు. అధికారులు తనను ఆదుకోవాలని కన్నీటిపర్యంతమయ్యాడు.

నేడు ఆర్‌ఎస్సీలో సైన్స్ ఫెస్టివల్

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో శని, ఆదివారాల్లో సైన్స్ ఫెస్టివల్ జరుపుతున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా, ఐడియా థాన్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందని తెలిపారు.

12నుంచి తిరుపతిలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ 12వ తేదీన నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. దీనికిముందు ఎస్వీ యూనివర్సిటీ నుంచి భారీ ర్యాలీ ఉంటుందని వెల్లడించారు. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్ష, కార్యదర్శులు ఆదర్శ్ ఎం.సాజి, భట్టాచార్య, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి రామోహ హాజరవుతారని తెలిపారు. చెన్నై హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు.

కారు ఢీకొని 8 గొర్రెల మృతి



కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం-కృష్ణగిరి జాతీయ రహదారిపై బిరుదనపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి కారు ఢీకొని 8 గొర్రెలు మృతి చెందాయి. ఒక రైతు గొర్రెలను తోలుకెళ్తూ ఉండగా కారు అతివేగంతో వచ్చి మందలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొన్ని గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే డ్రైవర్ వాహనం ఆపకుండా పారిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుమల శిలాతోరణం వద్ద డ్రోన్: అదుపులో ఇద్దరు



శిలాతోరణంపై డ్రోన్- శుభం కండేల్‌వాల్



తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో డ్రోన్ ఎగరేసిన ఇద్దరు భక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద వద డ్రోన్ ఎగురవేసి వీడియోలు తీస్తున్న జైపూర్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ భక్తుడు శుభం కండేల్‌వాల్ అలియాస్ సర్వలక్షణ్‌దాస్, ఒంగోలుకు చెందిన భానుసుందర్ అలియాస్ అర్జున్ బంధుదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇస్కాన్ భక్తులమని, హిందూ ధర్మప్రచారం కోసమే ఈ ప్రయత్నం చేశామని వారు వివరణ ఇచ్చారు. వీరిని విజిలెన్స్ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అలిపిరి తనిఖీల్లో అవరోధం లేకుండానే వీరు తిరుపతి నుంచి బస్సులో డ్రోన్‌తో రావడం విశేషం.

16న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

● వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపైనే ప్రధాన చర్చ

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 16న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పదిరోజుల పాటు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలపై చర్చ జరుగనుంది. అలాగే టీటీడీ కొనుగోళ్లపై కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు. జనవరి 25న జరుగనున్న రథసప్తమికి చేపట్టాల్సిన ఏర్పట్లపై కూడా చర్చించనున్నారు. బోర్డ్ సెల్ విభాగం అంజెండా అంశాలను సిద్ధం చేస్తోంది.

తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలి

● కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 3.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన ప్రతి విషయంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలంటే తరచూగా పాఠశాలలకు వెళ్తూ ఉపాధ్యాయులతో తమ పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకుంటూ ఉండాలన్నారు. తల్లిదండ్రులు పాఠశాలకు రావడం బాధ్యతగా భావించాలన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా కార్పొరేట్ తరహాలో విద్యనందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్‌లో ఎక్కువ శాతం విద్యకు ఖర్చు చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ప్రతి విద్యార్థికి ప్రభుత్వం రూ.5వేలనుంచి రూ.7500 వరకు ఖర్చు పెడుతోందన్నారు. విద్యార్థులుడ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.24 వేల కోట్లు విద్య కోసం కేటాయించిందన్నారు. పాఠ్యపుస్తకాల నుంచి యూనిఫాం, బూట్లు, బ్యాగులు, విద్యాసామగ్రివరకు అన్నీ ఉచితంగా అంది స్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ రమేష్ నాయుడు టీడీపీ నాయకులు జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎగువకొత్తూరులో ఏనుగుల దాడులు



పత్రపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా తోట →

సోమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె ఎగువకొత్తూరు సమీపంలోని బైగానికుంట వద్ద ఏనుగులు మకాం వేసి గురువారం రాత్రి సమీపంలోని వరి, టమోటా, మామిడి తోటల్లో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి. రైతులు ఏనుగులను గుర్తించి గ్రామానికి చేరుకున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా సాగుతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తరచూ ఏనుగులు పొలాల్లో సంచరించడంతో డ్రిప్ పైపులు, పీవీసీ పైపులను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆవులపల్లె పంచాయతీ ఇర్లపల్లె సమీపంలోని ఎల్లవంక ప్రాజెక్టు నీటి కొలనులో ఏనుగులు సంచరించాయి. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మూడు ఏనుగుల మృతి

● కారణాలు తెలుసుకునేందుకు ప్రత్యేక కమిటీ నియామకం





మృతి చెంది కుళ్లిపోయి ఉన్న ఏనుగు కళేబరం - ఏనుగుల కళేబరాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

రామకుప్పం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-తమిళనాడు సరిహద్దులోని పేర్నాంబట్టు అటవీ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఎస్టేట్‌లోని నీటి కుంట వద్ద మూడు ఏనుగుల కళేబరాలను స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించారు. ఏనుగుల మృతి అనుమానాస్పదంగా ఉందని అధికారులు భావిస్తున్నారు. అక్కడి నీటి కుంట ఒడ్డున రెండు ఏనుగుల కళేబరాలు, నీటి కుంటలో ఓ గున్న ఏనుగు కళేబరం గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించడంతో తమిళనాడు అటవీశాఖఅదనపు కన్జర్వేటర్ మారిముత్తు, వేలూరు జిల్లా అటవీఅధికారి అశోక్‌కుమార్, స్థానిక అటవీ అధికారులు రఘుపతి, ఇళయరాజ,మాధేశ్వరన్, కార్తీలు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న చిత్తూరు జిల్లా అటవీ అధికారి శ్రీనివాసులు, పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం అక్కడకు వెళ్లారు. ఏనుగుల కళేబరాలను పరిశీలించారు.ఏనుగులమృతిపై పలు అనుమానాలున్నాయని అదనపు కన్జర్వేటర్ మారిముత్తు తెలిపారు. వాటిని ఉద్దేశపూర్వకంగా చంపారా, కుంటలోని నీరు తాగి మృతి చెందాయా అన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మృతికి కారణాలు తెలుసుకునేందుకు అటవీ ఉన్నతాధికారులతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఐదుగురు నిపుణులైన పశువైద్యుల పర్యవేక్షణలో మృతి చెందిన ఏనుగులు కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కమిటీ దర్యాప్తుతో పాటు ఏనుగులు మృతిచెందిన కుంటలోని నీరు, మట్టి నమూనాలన పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పేర్నాంబట్టు అటవీ ప్రాంతంలోనే గత నెలలో అరవట్ల కొండలో ఓ ఏనుగు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు.

వ్యవసాయ వర్సిటీ క్రీడా, సాంస్కృతికోత్సవాలు ప్రారంభం



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడా సాంస్కృతి అంశాలతో విద్యార్థుల్లో శారీరక, మానసికోత్తేజం కలుగుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా, సాంస్కృతిక పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నాని మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉందన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా సాంస్కృతిక పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు వ్యవసాయ రంగంతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. వ్యవసాయ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, వ్యవసాయ వర్సిటీ డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలు, సాంస్కృతిక వక్తృత్వ పోటీలలో పాల్గొనడం విద్యార్థుల మనోవికాసానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డి శేఖర్, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీ సుమతి, కళాశాల పీడీ రవికాంత్‌రెడ్డి, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి హరిప్రసాద్ పాల్గొన్నారు.కాగా బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక పోటీల్లో పెయింటింగ్స్, కొల్లెజ్ వంటి అంశాలతో పాటు వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎనిమిదిమంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం స్థానిక ఫారెస్టు బీటు ఆఫీసర్ అంజనాస్వాతితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్ చిన్నముచ్చురాళ్లగుట్ట వద్ద కూంబింగ్ చేపట్టారు. కొంతమంది గుమికూడి ఉండటం గమనించి, సమీపిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఎనిమిది మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ స్కిల్ హబ్ సహకారంతో చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఉచితంగా నిర్వహించనున్న ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి నుంచి ఉన్నత విద్య చదివిన వారు అర్హులని తెలియజేశారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ కోర్సులో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలో అవసరమైన ప్రయోగాలు, పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్ కాపీలు, మొబైల్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీతో ట్రైయినర్లు చిరంవి(85003 848212), భూపతి(9885637771), రూపేష్(9160940479) లను సంప్రదించాలని కోరారు.

ఫేక్ ప్రచారాలు చేస్తున్న జగన్: టీడీపీ

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ తన ఉనికి కోసం తప్ప ప్రజల కోసం ఆలోచించరన్నారు. నెలకోసారి బెంగళూరు నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో రావడం, నాలుగు గోడల మధ్య నలుగురు సెలెక్టెడ్ జర్నలిస్టులకు పిలిపించుకుని నాలుగు గంటలపాటు మాట్లాడిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడితే ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ వైసీపీ నేతలు కుట్రలు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ముందుకువెళతోందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంకోసం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంకోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని చెప్పారు.

అరటి తోటను నరికేసిన దుండగులు

● కేసు నమోదు



కృష్ణాపురం వద్ద నరికేసిన అరటి మొక్కలను పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

వి.కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం కృష్ణాపురంలోని రఘుపతి అనే రైతుకు చెందిన అరటి తోటను గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి నరికి ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం సుమారు ఒకటిన్నర ఎకరాలో రెండు నెలల క్రితం నాటిన 1200 అరటి మొక్కలను తనపై కక్షతో ధ్వంసం చేశారని బాధిత రైతు కన్నీటి పర్యంతమవుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్లను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖర్ తెలిపాడు. రూ. 2 లక్షలు పైగా పంట నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు.

బోయకొండలో అక్రమాలపై దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

చౌడేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో పలు అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై దేవదాయశాఖ కమిషనర్‌కు పాల ఏకరి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం నిధులు దుర్వినియోగం అయ్యాయని, పలువురి సిబ్బందిని రాష్ట్ర దేవదాయ కమిషనర్ అనుమతి లేకుండా నియమించారని, గత కొంతకాలంగా ఆలయ ఆదాయానికి భారీగా గండి పడిందని, గత వైసీపీ ప్రభుత్వంలో పాలక మండలి లేకపోవడంతో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమ్మవారి సొమ్ము కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగమైనట్లు తనకు పలువురు టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో నేటి వరకు విచారణ చేపట్టాలని, అవినీతి, అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు త్వరలో ఆలయ అక్రమాలపై ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు సుందరరాజపురంలోని విజయం కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, మోహన్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఎస్టీయూ జిల్లా నూతనకార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని, జిల్లా, మండల స్థాయి ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని కోరారు.

స్టాఫ్‌నర్సు పోస్టు ఇప్పిస్తామంటూ మోసం

పుంగనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కోర్సు చేసిన ఓ మహిళ ఎన్‌హెచ్‌ఎం నర్సు పోస్టుకు దరఖాస్తు చేయగా చిత్తూరు డీఎంఅండ్‌హెచ్‌వో ఆఫీసు నుంచి మాట్లాతున్నామని, ఉద్యోగం ఇప్పిస్తామంటూ కేటుగాళ్లు రూ.1.60 లక్షలు కాజేసి మోసం చేసినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా.. కర్నూలుకు చెందిన ఎం.అరుణ పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన సురేశ్‌ను వివాహం చేసుకుని పుంగనూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. కాగా 2024లో అరుణ ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సు పోస్టుకు చిత్తూరు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేయగా ఇంతవరకు పోస్టుకు సంబంధించి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆమె తాను సెలెక్ట్ కాలేదనుకున్నారు. గతనెల 19న 8282836125 నంబరు నుంచి ఫోన్ చేసి తనపేరు అవినాష్ అని.. తాను డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే కొంతడబ్బు ఖర్చు అవుతుందన్నారు. సమస్యల్లో ఉన్న తమకు స్టాఫ్‌నర్సు పోస్టు వస్తే కష్టాలు తీరిపోతాయని ఆమె అతని మాటలు నమ్మి భర్తతో చర్చించి వెంటనే రూ.5 వేలు ఫోన్‌పే చేసింది. తర్వాత 9051486292, 9073137562 నెంబర్లతో ఫోన్లు చేయగా ట్రూకాలర్‌లో ఎన్‌హెచ్‌ఎం ఆఫీసు, ఎన్‌హెచ్‌ఎం కౌన్సిలర్ అంటూ రావడంతో అరుణకు అనుమానం రాలేదన్నారు. మొత్తం రూ.1.60 లక్షలు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపారు. కాగా గతనెల 26న ఆన్‌లైన్ ఇంటర్వ్యూ అంటూ సెల్‌లో మాట్లాడి మరో రూ.లక్ష ఇస్తే స్టాఫ్‌నర్సు పోస్టు వస్తుందని చెప్పారు. కాగా ఈవిషయంపై అరుణ పనిచేసే వైద్యులు, డీఎంఅండ్‌హెచ్‌వో ఆఫీసులో విచారించగా అలాంటివి జరగవని, మోసపోయినట్లు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశామని ఆమె శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఈవిషయంపై సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

పండుగ వాతావరణంలో పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్


కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు


పలమనేరులో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి


వి.కోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



రామకుప్పం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి


కుప్పం: గణేశ్‌పురంలో పీఎస్.మునిరత్నం తదితరులు


చారాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసన్నకుమార్

రామకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. పాఠశాలలను అరటి చెట్లు, మామిడి తోరణాలు, పుష్పాలతో అలంకరించి తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. మండల పరిధి సింగసముద్రం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ రవికుమార్ మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యమవుతాయని.. పిల్లల విద్యాభ్యాసం, నడివడికలపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించాలని సూచించారు. టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు** : పులిచెర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల బాలికల పాఠశాల, నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, విండో చైర్మన్ ధనంజయనాయుడు, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు.

● **రొంపిచెర్ల**: పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహిస్తోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు జరిగాయి. రొంపిచెర్ల ఉన్నత పాఠశాలలో చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. పాఠశాల నుంచి మాక్ అసెంబ్లీకి వెళ్లిన విద్యార్థి పి.నిఖిల్‌ను సన్మానించారు. పదో తరగతిలో 570 మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ.లక్ష ఇస్తారని సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మీ, సీఎంవో మధు, పాఠశాల కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు పాల్గొన్నారు.

● **పలమనేరు**: పలమనేరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం పీటీఎం సమావేశాలు నిర్వహించారు. పలమనేరు, పెంగరగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశాల్లో ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, పలమనేరు బాలికోన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **సోమల**: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. సోమల ఉన్నత పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు పాల్గొని సూచనలు చేశారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవోలు శివరత్న, విజయకుమారి, ఎస్‌ఐ శివశంకర, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**కుప్పం**: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కేజీబీవీ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కంగుంది, గణేశ్‌పురంలోని పాఠశాలల్లో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఐబీసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, గోపీనాథ్ పాల్గొన్నారు.

● **వి.కోట**: రాష్ట్రంలో ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు, కళాశాలలు ఉంటున్నాయని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి అన్నం వడ్డించారు.

● **పుంగనూరు**: పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.శమిపతి పూజగానిపల్లె హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో అప్పాజీ, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో నటరాజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె**: బైరెడ్డిపల్లె, లక్కనపల్లె, తీర్థం, బేలుపల్లె పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో ఎంఈవోలు జనార్దన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో

● శాంతిపురం: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరిగింది. మండల టీడీపీ అధ్యక్షుడు ఉదయకుమార్ నాయుడు, ఎంఈవోలు సెల్వపాండియన్, చంద్రమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు, నేతలు పాల్గొన్నారు.

● గుడిపల్లె: గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సురేష్‌బాబు, తసోడిగానిపల్లె ఉన్నత పాఠశాలలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

● **సదుం**: సదుం మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు జరిగాయి. ఎంపీడీవో రాధారాణి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె** : చారాల హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసన్నకుమార్ పాల్గొని సూచనలిచ్చారు. ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ పార్వతి, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..



రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డి


సోమల: ఇరికిపెంటలో ఏఎంసీ చైర్మన్


పుంగనూరులో ఏఎంసీ చైర్మన్ శమిపతి

కృషితో విజయం తథ్యం



కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ నాగప్రసాద్, బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన కృషితో విజయం తథ్యమని మోటివేషనల్ స్పీకర్ నాగప్రసాద్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతో పాటు వి.కోట, పలమనేరు మండలాల్లోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ) చదువుతున్న విద్యార్థులకు 'ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపన ఉంటుందన్నారు. అయితే కొందరు మాత్రమే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరన్నారు. వారిలో క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల, తగిన కృషి ఉండటమే కారణమని తెలిపారు. విజయం సాధించాలంటే అవరోధాలను దాటుకుంటూ లక్ష్య సాధనకు అనువైన మార్గాన్ని శోధించాలని ఉద్బోధించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. ఆర్యులు కృషితో నాస్తి దుర్భిక్షం అని చెప్పారన్నారు. నైపుణ్యాలను మెరుగు పెట్టుకుని తగిన కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వవిద్యాలయానికి ఏమాత్రం తీసిపోని అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ జీఎన్.కోదండరామయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీజీ.శరవణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.జయకుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక పాలనే అందించడమే సమాచార హక్కు చట్టం ఉద్దేశమని.. చట్టంపై ఉద్యోగులందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేస్తే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ అధికారిక సమాచారం ఏది కోరినా సకాలంలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యంరెడ్డి, ఏపీఎం చంద్రమోహన్, ఏపీవో సౌభాగ్యవతి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వర్క్‌షాప్ తనిఖీ


టెక్నీషియన్‌తో మాట్లాడుతున్న తులసీనాథ్

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రత్యేక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వర్క్‌షాప్‌ను శుక్రవారం రెస్కో డైరెక్టర్ ఎస్ఎస్.తులసీనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని సదుపాయాలు, నిర్వహణ, పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెస్కో అధికారులు, టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలి


పాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ముత్యాలు

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే పౌష్టికాహారం సక్రమంగా చేయాలని మండల ప్రత్యేకాధికారి ముత్యాలు తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట సచివాలయం పరిధిలోకి కొక్కువారిపల్లి, ఎంఎం రాచపల్లి, దేవళంపేట, పాళెం అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి ముత్యాలు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాకు రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా.. లేదా అని ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, కేంద్రాల బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు సంతోష్, సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై శిక్షణ


చట్టంపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

పుంగనూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టంపై మండలంలోని సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులకు అవగాహన ఉండాలని పుంగనూరు ఎంపీడీవో అప్పాజీ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు నారాయణ, సుధాకర్‌రావు, ఏవో రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో యల్లమ్మ



కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం వగళ్లవారిపల్లి బస్టాపు సమీపంలో కొలువైన యల్లమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో అలంకృతురాలైన అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు శ్రీనివాస దీక్షితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈవో అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

వి.కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగుల హక్కుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని దివ్యాంగ మిత్ర సేవా సంఘం అధ్యక్షులు నాగరాజ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికోట పట్టణంలో వికలాంగుల హక్కుల పరిరక్షణకు తామంతా ఒక్కటేనంటూ డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అఖిల పక్షం నేతలు రంగనాథ్, అమరేంద్ర, అన్నదాన సేవా సంఘం వేణుతో పాటు రాష్ట్ర దివ్యాంగ నేతలు మురళీ, చంద్రశేఖర్, మురళీగౌడ, చిన్నగురప్ప, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంతాన సాఫల్య శిబిరం


దంపతుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ తరంగిణి

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని సాయిరాం మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి, గర్భగుడి సంతాన సాఫల్య కేంద్రం సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పలువురు దంపతులు పరీక్షలు చేయించుకొని సూచనలు పొందారు. కార్యక్రమంలో సాయిరాం ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.తరంగిణి, గర్భగుడి సంతాన సాఫల్యకేంద్రం ఐవీఎఫ్ డాక్టర్ పి.వి.వాసవీ దేవి దంపతులకు పరీక్షలు నిర్వహించి సూచనలిచ్చారు. శిబిరంలో 56 మంది మహిళలకు ఉచిత స్కానింగ్, కన్సల్టేషన్, కౌన్సెలింగ్, సెమెన్ అనాలిసిస్ పరీక్షలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రైవేటు బస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పచ్చిబఠానీలు, శనగల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవి, నగరిలోని ప్రసన్న పార్వతీదేవి ఆలయంలో పార్వతీదేవికి అర్చకులు అభిషేకాలు, విశేష పూజలు చేసి ప్రత్యేక అలంకరణలతో భక్తులు దర్శనమిచ్చారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే 18వ సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధరగుప్తా పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు ఏరియా ఆస్పత్రి వద్ద సీఐటీయూ మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సావిత్రి, నాయకులు జయంతి, రాజా, బుజ్జమ్మ, కార్యదర్శులు లోకేష్, నారాయణమ్మ, గీత, లత, శ్యామల, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్దూరులో ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న వలంటీర్లు, అధ్యాపకులు

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మున్సిపాలిటీ పరిధిలోని గడ్దూరు గ్రామంలో 7 రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ఆర్.వెంకటేసులు, అధ్యాపకులు డాక్టర్ రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సోమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం అన్నెమ్మగారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్‌ఐ శివశంకర తెలిపారు. బాలిక తల్లిదండ్రులు వెతికినా కనిపించకపోవడంతో శుక్రవారం సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మండల ఎస్టీయూ నూతన కార్యవర్గం



ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు

చౌడేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మంజునాథ్, పరిశీలకులు శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ వద్ద ఉన్న ఎంపీపీ స్కూల్‌లో జరిగిన ఎస్టీయూ ఎన్నికల్లో మండల అధ్యక్షురాలిగా వసంత, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా షబ్బీర్ మహ్మద్, గౌరవ అధ్యక్షుడిగా ఏవీ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా సుధాకర్‌నాయుడు, సూర్యప్రకాష్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్, లింగమూర్తి, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సోమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద పాలేటమ్మ ఆలయ సమీపంలో గత నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శివశంకర శుక్రవారం తెలిపారు. పాలేటమ్మ మలుపులో ద్విచక్రవాహనం ఆర్టీసీ బస్సును ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో కమ్మపల్లెకి చెందిన రహమతుల్లా తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఏరియా ఆస్పత్రికి గీజర్ వితరణ




గీజర్‌ను వితరణగా అందజేస్తున్న ప్రియదర్శిని

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఏరియా ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతల కోసం శుక్రవారం సీరియల్ నటుడు లక్ష్మణ్ సతీమణి క్రె.ప్రియదర్శిని గీజర్‌ను వితరణగా అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణికి గీజర్‌ను వితరణగా అందజేశారు. కొద్దిరోజుల క్రితం ప్రియదర్శిని పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పురుడు పోసుకున్నారు. ఆమెకు అందించిన వైద్యసేవలను గుర్తుంచుకొని గీజర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు యుగంధర్, మీనాక్షి తదితరులు ఆమెను అభినందించారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

కుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

బయోమెట్రిక్ విధానంతో ఎరువుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పలమనేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు బయోమెట్రిక్ విధానంతో ఎరువులు పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం పలమనేరు వెలుగు కార్యాలయంలో పలమనేరు డివిజన్‌లోని 7 మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు నాణ్యతతో కూడిన ఎరువులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పలమనేరు సహాయ సంచాలకులు సావిత్రి, ఏవోలు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



చిత్తూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు.

ప్రజలకు పారదర్శక సేవలందించాలి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టౌన్‌ప్లానింగ్ విభాగానికి వచ్చే ప్రజలకు పారదర్శక సేవలందించాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ సూచించారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ఇంజనీర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, టెక్నికల్ పర్సన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీలు నాగేంద్ర, శుభప్రద, చుడా ప్లానింగ్ ఆఫీసర్ చంద్రమోహన్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ షణ్ముగం, పలమనేరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలి

గుడిపాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని డీఆర్వో మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భవిత సెంటర్‌లో దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులనాయుడు, ఎంపీడీవో శిరీష, హెచ్ఎం దుర్వాసులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ టీఆర్ ఢిల్లీబాయి, ఎంపీవో గణపతి, భవిత, వాణి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల వితరణ

నగరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులకు నగరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపకరణాలు వితరణగా అందించారు. శుక్రవారం విద్యార్థులకు క్యారియర్ బాక్సులు, ఇతర ఉపకరణాలను రిటైర్డ్ డీవైఈవో ప్రభాకర్‌రాజు విరాళంగా అందించగా, ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఏ.మోహన్, డైరెక్టర్ రాధాకృష్ణ, కోశాధికారి శక్తివేలు, కిషోర్‌కుమార్, దేవన్, షఫీ, ఏపీఎం సుభాషిణి, శిక్షకులు భవాని నాయక్, ఫిజియోథెరపిస్టు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వంలో.. మంచి పథకాలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంచి ప్రభుత్వంలో ప్రజలకు మంచి పథకాలు, అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జగన్మోహన్ చెప్పారు. ప్రధాన మంత్రి అవాజ్ యోజన, ఎన్టీయార్ అర్బన్ హౌసింగ్ పథకంలో భాగంగా శుక్రవారం నగరపాలక కార్యాలయంలో 662 మంది లబ్ధిదారులకు గృహ పత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, హౌసింగ్ ఈఈ శంకరప్ప, డీఈ శ్రీధర్, నాయకులు వెంకటేశ్ యాదవ్, నరేష్, పచ్చయప్ప పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

చిత్తూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికే పకరజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రజల వద్ద అర్జీలు స్వీకరించారు. టీడీపీ నాయకులు సీఆర్ రాజన్, జయచంద్రనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, వెంకటేష్ పాల్గొన్నారు.

పూతలపట్టు సీఐగా గోపి

పూతలపట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐగా గోపి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు వీఆర్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐ కృష్ణమోహన్ చిత్తూరు వీఆర్‌కు వెళ్లారు.

ఎస్‌బీ సీఐ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):స్పెషల్ బ్రాంచీ ఇన్‌స్పెక్టర్‌గా మురళీ మోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పలమనేరు అర్బన్ నుంచి ఇక్కడికి వచ్చారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : డీఎస్పీ

వెదురుకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం తగదని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశించారు. శుక్రవారం వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్

వెదురుకుప్పం, డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత నిస్తోందని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయి చేరాలని మాల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. శుక్రవారం కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సమావేశాల్లో హెచ్ఎంలు శేఖర్, నాదముని, ఎంపీడీవో చంద్రమౌళి పాల్గొన్నారు.

వందేళ్ల జీవితానికి వంద రోజుల ప్రణాళిక

వందేళ్ల జీవితానికి వంద రోజుల ప్రణాళిక పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని యుగంధర్ పొన్న తెలిపారు. డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలురాసే విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశం జరిగింది. ఎంపీడీవో చంద్రమౌళి, హెచ్ఎం నాదముని, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

- వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌మురళి, ఎర్రగుంటపల్లి పాఠశాలలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి, దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్ పాల్గొన్నారు.

వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పూతలపట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు ప్రజలకు అందు బాటులో ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారులు, వైద్యసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీయిచ్చారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబుచౌదరి, నాయకులు బాబురావు, నేతాజి, మురళీనాయుడు, గణపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రవాణా మంత్రిని కలిసిన కాణిపాక ఆలయ చైర్మన్



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం వరసిద్ధుడి ఆలయ చైర్మన్ మణినాయుడు రాయచోటిలో కలసి స్వామి ప్రసాదాన్ని అందించారు. ఈ నెల 7న ఆదివారం కాణిపాకంలో ఆత్మీయ సమావేశానికి రావాలని ఆహ్వానించారు.

ఘనంగా పీటీఎం

తవణంపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా టీచర్స్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో హేమలత, పొన్నేడుపల్లె పాఠశాలలో తహసీల్దార్ సుధాకర్, అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తొడతర పాఠశాలలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభుకిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

బంగారుపాళ్యం: మాజీ వైస్ ఎంపీపీ హిమాకర్ రాజా జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, ఉన్నారు.

తలారీ మృతికి సంతాపం

బంగారుపాళ్యం: మండలంలోని కల్లూరుపల్లె పంచాయతీ తలారీగా పని చేస్తున్న దేవయ్య శుక్రవారం మృతి చెందాడు. తహశీల్దార్ షబ్బీర్ బాషా, సిబ్బంది నివాళులు అర్పించారు. రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందించారు.

క్యాన్సర్ పరీక్షలకు అనూహ్య స్పందన

యాదమరి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం తొమ్మిది సచివాలయాలకు చెందిన సుమారు 120 మంది మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు సీఎంసీ వైద్య నిపుణులు నిర్వహించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దుస్తుల పంపిణీ



యాదమరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు దాతలు దుస్తులను పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభావంతులైన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఆయన ప్లేట్లు, గ్లాసు, దుస్తులు అందజేశారు. ఎంఈవో రుక్మిణి, ఉపాధ్యాయులు హేమలత, వెంకటరమణ, మల్లికార్జున పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం

యాదమరి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన మండల సమావేశంలో అధ్య క్షులుగా ఎం. సురేష్ కుమార్, కార్యదర్శిగా సర్దార్, ఆర్థిక కార్యదర్శిగా పార్థసారధిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీఈఎస్‌కు వరుసగా రెండోసారి టాప్ ర్యాంకు

యాదమరి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేష కృషిచేస్తున్న పాఠశాలలను గుర్తించి సత్కరించే "ఇండియా స్కూల్ మెరిట్ అవార్డ్స్ -2025"లో భాగంగా చిత్తూరు జిల్లాకు చెందిన పీఈఎస్ పబ్లిక్ పాఠశాల జిల్లాస్థాయిలో మరోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది కూడా టాప్ ర్యాంకు సాధించి, వరుసగా రెండోసారి ఈ ఘనత సాధించడం విశేషం. శుక్రవారం బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ. కృష్ణబాబు ఈ అవార్డును ఎడ్యుకేషన్ న్యూస్ నెట్వర్క్ సంస్థ చేతుల మీదుగా అందుకున్నారు.

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



వెదురుకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఆదర్శ పాఠశాలను శుక్రవారం డీఈవో వరలక్ష్మి తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో జరిగిన టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వ బడిలో చదివిన వారికే భవిష్యత్తులో ఉద్యోగాలు

- ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా జీవో రానున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ పేర్కొన్నారు. పేరెంట్స్ టీచర్స్ మీటింట్ శుక్రవారం తూగుండ్రం హైస్కూల్లో జరిగింది. విద్యాకమిటీ చైర్మన్ సుధాకర్‌శెట్టి, హెచ్.ఎం.రాజేంద్రనాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన వారే ప్రపంచదేశాల్లో ప్రముఖ కంపెనీలకు సీఈవోలుగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచేందుకు, నూతన వంటగది నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడు ముప్పిరి మోహన్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నియాజ్‌అలీ, కామసాని కోదండరెడ్డి, పార్లమెంట్ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, మండల క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు శాంతకుమార్, టీడీపీ నాయకులు రాఘవేంద్ర, సంపత్, కండిగ శంకర్, దాసరపల్లె శంకర్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



తూగుండ్రం హైస్కూల్లో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ థామస్

విద్యార్థులు బంగారు భవితకు బాట వేసుకోవాలి : చినబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు

నగరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ తమ బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ చినబాబు పేర్కొన్నారు. నగరి బాలికల ఉన్నత పాఠశాల, నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తే సరిపోదని ప్రతినెలా పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులతో తమ పిల్లల గురించి చర్చించాలన్నారు. పశ్చిమబెంగాల్ డీఐజీ అనంతనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టించి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పాఠశాల స్థాయిలో ఎవరైతే క్రమశిక్షణ కలిగి ఉంటారో వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలియజేశారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం, నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ శ్రీని వాసులురెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కర్ణ, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సలీం, శ్రీధర్, నారాయణస్వామినాయుడు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి ఆహ్వానం

- థామస్‌కు కాణిపాకం ఆలయ చైర్మన్ సన్మానం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన కాణిపాకంలో ఆలయ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్‌ను కాణిపాకం ఆలయ చైర్మన్ మణినాయుడు, ఆలయ బోర్డు సభ్యులు అనసూయమ్మ ఆహ్వానించారు. తూగుండ్రం హైస్కూల్లో పీటీఎం కార్యక్రమానికి విచ్చేసిన థామస్‌ను వారు కలిసి ఆహ్వానం పలికారు. శాలువా కప్పి సన్మానించారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధతీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంఈవో

విజయపురం, డిసెంబరు 5: మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు పన్నూరు, శ్రీహరిపురం, జంబాడ, విజయపురం, జీఎంపురంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలు, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాదరంగా ఆహ్వానం పలికారు. మండలంలోని కేశవపురం ప్రాథమిక పాఠశాలలో నియోజవర్గ తెలుగునాడు స్టూడెంట్ పెడరేషన్ ఉపాధ్యక్షుడు కొండూరు దామోదరం విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. కోసలనగరంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాబుయాదవ్, మహారాజపురంలో చిత్తూరు పార్లమెంటు కార్యానిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, పాతార్కాడులో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సర్పంచ్ బొబ్బిలి, ఆలపాకంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, శివలింగం, శ్రీహరిపురంలో టీడీపీ నాయకులు సురేష్‌రాజు, ఇళ్లత్తూరులో మునిభాస్కర్‌రాజు, ఎంపీడీవో రాజేంద్ర, బూచివానత్తంలో బాబు, మురళీ, కేవీపురంలో మధునాయుడు, వేణుగోపాల్‌నాయుడు తదితరులు తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం చేస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగలా పీటీఎం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వెంకటరమణ

పాలసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పీటీఎం పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో పిల్లల చదువు గురించి టీచర్లు వారికి వివరించారు. మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ కావేరిరాజుపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ హేమలత, ఎంఈవో రాజేంద్రప్రసాద్, గిరిజ పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ

నింద్ర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిల్లల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం జరిగింది. నింద్రలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా విచ్చేశారు. మంగళగిరి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో నింద్ర పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గతంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్‌రాజు, నింద్ర సర్పంచ్ వసంతబాబురెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దివ్యాంగులకు బహుమతుల ప్రదానం



విజయపురం, డిసెంబరు 5: విజయపురం విద్యావనరుల కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఎంఈవో హరిప్రసాద్‌వర్మ బహుమతులు ప్రదానం చేశారు. పన్నూరు పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, భవిత కేంద్ర సిబ్బంది శివకుమార్, పుష్ప పాల్గొన్నారు.

వందశాతం పూర్తి చేయాలి



సమావేశంలో సూచనలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు

వెదురుకుప్పం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటు)కార్యక్రమం ఆన్‌లైన్‌లో వందశాతం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు సూచించారు. శుక్రవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమావేశమ య్యారు. ఎన్‌సీడీ సీడీ4.0 కార్యక్రమం, అభా, పల్స్ పోలియో కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సీ 4.0 ఆన్‌లైన్ కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలని, డయాబెటిక్, హైపర్ టెన్షన్, క్యాన్సర్ కొత్త కేసులను గుర్తించి వారికి తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీవై కృష్ణచైతన్య, సీహెచ్‌వో కొప్పేటి మధుసూదన్, సూపర్‌వైజర్లు మోహన్ మురళీనాథ్, ఈశ్వరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

వెదురుకుప్పం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పుత్తూరు పట్టణ సమీపంలోని చిన్నరాజుకుప్పంకు చెందిన మౌళి, అలేఖ్య అన్నదానం చేశారు. స్వామి వారిని మాడవీధుల్లో ఊరేగించారు. దీపారాధన చేశారు.

అందరూ ఓట్లేస్తేనే చరిత్ర తిరగరాశా: థామస్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీల వారు ఓట్లేయబట్టే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 30ఏళ్ల తర్వాత టీడీపీ జెండా ఎగురవేసి చరిత్రను తిరిగిరాశానని ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎం.థామస్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం సచివాలయం వద్ద శుక్రవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నుంచి వచ్చిన వారెవరికీ తాను పదవులు ఇవ్వలేదన్నారు. టీడీపీ వారికే ఇచ్చామన్నారు. టీడీపీలో కొందరు చాడీలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. ఐక్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు లాగా తాను మంజూరుచేసే పనులకు పర్సంటేజీలు అడగడం లేదని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ ముక్కళత్తూరులో మాజీ సర్పంచ్ జాన్‌ను, వేల్కూరు రోడ్డు దళితవాడలోని బుజ్జిబాబును పరామర్శించారు.

ఎరువుల పంపిణీ

వెదురుకుప్పం: రాయితీ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత జీడీనెల్లూరు నియోజక వర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ కోరారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ప్రభుత్వం అందజేసిన రాయితీ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, గ్రామ సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆకాంక్షించారు. శుక్రవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశంలో ఆయన మాటాడారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. చదువులు మెరుగుపడటానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, మండల పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, మాజీ సర్పంచ్ మధుసూదనరావు,హేమాద్రినాయుడు, దొరబాబు, ఎంఈవో రుష్యేంద్రనాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెరిగేలా బోధించండి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

బంగారుపాళ్యం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): చదువు పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా ఉపాధ్యాయులు విద్యను బోధించాలని ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్ సూచించారు. మండలంలోని మొగిలి మిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల ఆవరణంలో శుక్రవారం మెగా టీచర్స్ పేరేంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో టీడీపీ మండల గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ హాజరయ్యారు. క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు రాజేంద్ర, జనార్ధన్‌రెడ్డి, చంద్రిక, మోహన్ పాల్గొన్నారు.

పెనుమూరు: ఉగ్రాణంపల్లె హైస్కూల్లో నిర్వహించిన పీటీఎంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు మాట్లాడారు. రిటైర్డ్ ఎంఈవో వరలక్ష్మి, జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలు అరుణ, జిల్లా టీడీపీ కార్యదర్శి రెడ్డెప్ప, హెచ్ఎంలు రమేష్, సంధ్య, పరమేశ్వరరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ మునేంద్ర, ఆర్.ఐ. మనోజ్ పాల్గొన్నారు.